

తిరువణ్ణామలై రద్దీ

పౌర్ణమి సందర్భంగా తిరువణ్ణామలైకి వెళ్లేం దుకు భక్తులు క్యూ కట్టారు. తిరుపతి బస్టాండ్ కిటకిటలాడింది.

- 8లో



కూల్చేశారు

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులన్న కక్ష్యతో అధికారులు తమ దుకాణాన్ని కూల్చేశారని బాధితుడు ఆరోపించాడు.

- 8లో



ఘాట్ రోడ్డులో ప్రమాదాలు

తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో శనివారం సాయంత్రం రెండు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.

- 8లో

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ పీఏసీ మెంబర్లుగా నారాయణస్వామి, రోజా



నారాయణస్వామి



ఆర్కే రోజా

తిరుపతి మంగళం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ 'పొలిటికల్ అడ్వైజర్ కమిటీ'ని పూర్తి స్థాయిలో పునర్ వ్యవస్థీకరించి పీఏసీ మెంబర్లను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం తెలిపింది. ఈ మేరకు పీఏసీ మెంబర్లుగా మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి, మాజీ మంత్రి ఆర్కే రోజాను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులను జారీ చేసింది.

14న గ్రీవెన్స్ రద్దు

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో ఈనెల 14న జరగాల్సిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌తోపాటు డివిజన్, మండల స్థాయిలోనూ గ్రీవెన్స్‌ను రద్దు చేసినట్టు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.



ఇంటర్‌లో మెరుపులు

ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల విద్యార్థులు సత్తాచాటారు. అత్యుత్తమ మార్కులతో అదరగొట్టారు. రాష్ట్ర స్థాయిలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 71 శాతం ఉత్తీర్ణతతో 9వ స్థానం, ద్వితీయ సంవత్సరంలో 86 శాతం ఉత్తీర్ణతతో 8వ స్థానాన్ని కైవశం చేసుకున్నారు. తల్లిదండ్రులకు, కళాశాల యాజమాన్యాలకు గుర్తింపు తెచ్చారు.

జిల్లాకు 8, 9 స్థానాలు

- సీనియర్ ఇంటర్‌లో 86 శాతం, జూనియర్ ఇంటర్‌లో 71 శాతం మంది ఉత్తీర్ణత
- మే 12 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు
- మే 28 నుంచి జూన్ 1 వరకు ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ప్రాక్టికల్స్
- రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు 13 నుంచి 22వ తేదీల్లోపు ఫీజు చెల్లింపునకు గడువు
- సప్లిమెంటరీ, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలకు 15 నుంచి 22వ తేదీలోపు ఫీజు చెల్లింపునకు గడువు

నాలుగేళ్ల ఉమ్మడి చిత్తూరు జిల్లా ఇంటర్ ఫలితాలు

సంవత్సరం	ఫస్టియర్	సెకండియర్
2019–2020	57శాతం	64శాతం
2020–2021	ఆల్ పాస్(కోవిడ్)	
2021–2022	51శాతం	58శాతం
2022–2023	64శాతం	75శాతం

గత ఏడాది తిరుపతి జిల్లాలో ఫలితాలు

	ఫస్టియర్	సెకండియర్
2023–2024	70శాతం	81శాతం

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్ ఫలితాలను శనివారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో తిరుపతి జిల్లా 9, 8 స్థానాలను దక్కించుకున్నట్లు ఇంటర్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి (ఆర్ఐఓ) జీవీ.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మార్చి 1నుంచి 20వ తేదీ వరకు జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు 86 పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరా పర్యవేక్షణలో జిల్లా ఇంటర్ బోర్డు అధికారులు పరీక్షలు నిర్వహించారు. ఇంటర్ ప్రథమ సంవత్సర జనరల్, ఒకేషనల్ విద్యార్థులు 31,479 మంది హాజరయ్యారు. వీరిలో 22,403 (71శాతం) మంది ఉత్తీర్ణత సాధించడంతో జిల్లాకు 9వ స్థానం లభించింది. అలాగే ద్వితీయ సంవత్సరం జనరల్, ఒకేషనల్ విద్యార్థులు 28,4630 మంది హాజరవ్వగా వారిలో 24,581 (86శాతం) మంది ఉత్తీర్ణత సాధించడంతో జిల్లాకు 8వ స్థానం దక్కిందని ఆర్ఐఓ తెలిపారు. జిల్లా నుంచి ప్రథమ, ద్వితీయ జనరల్, ఒకేషనల్‌తో పాటు ప్రైవేటు విద్యార్థులు 61,727మంది హాజరవ్వగా వారిలో 47,898మంది ఉత్తీర్ణత సాధించారు.

మే 12 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను మే 12 నుంచి 20వ తేదీ వరకు రోజూ ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు నిర్వహించనున్నట్లు ఆర్ఐఓ పేర్కొన్నారు. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ప్రాక్టికల్స్ మే 28 నుంచి జూన్ 1వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే జూన్ 4వ తేదీన ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్, 6వ తేదీన ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలను ఆయా తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఫీజుల వివరాలు.. గడువు తేది

రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకునే వారు ఈ నెల 13 నుంచి 22వ తేదీ లోపు రీకౌంటింగ్‌కు రూ.1,300, రీ వెరిఫికేషన్‌కు రూ.260 చెల్లించాలని ఆర్ఐఓ తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలకు జనరల్, ఒకేషనల్ విద్యార్థులు రూ.600, ప్రాక్టికల్స్‌కు రూ.275, జనరల్/ఒకేషనల్ బ్రిడ్జి కోర్సు(మ్యాథ్స్, బైపీసీ విద్యార్థులు) రూ.165, ఒకేషనల్ బ్రిడ్జి కోర్సు ప్రాక్టికల్ (ద్వితీయ సంవత్సరం)కు రూ.275, బెటర్ పర్ఫార్మెన్స్ (ఇంప్రూవ్‌మెంట్)కు ప్రథమ, ద్వితీయ సంవత్సర ఆర్ట్స్ విద్యార్థులు రూ.1,350, సైన్స్ వారు రూ.1,600 ఫీజు చెల్లించాలని చెప్పారు.

అధైర్యపడొద్దు

ఇంటర్ ఫలితాల్లో మార్కులు తక్కువ వచ్చాయనో, ఫెయిలయ్యామనో విద్యార్థులు అధైర్యం చెందవద్దని, క్షణికావేశపు నిర్ణయాలు తీసుకోవద్దని ఆర్ఐఓ విద్యార్థులకు సూచించారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ద్వారా మెరుగైన మార్కులు సాధించడానికి అవకాశం ఉందని తెలిపారు.

మీడియాకు సంకెళ్లా?

జిల్లా వ్యాప్తంగా కదం తొక్కిన కలం కార్మికులు

- నిరసనలు, ధర్నాలు, ర్యాలీలతో హోరెత్తించిన జర్నలిస్టులు
- సాక్షి ఎడిటర్, పాత్రికేయులపై కేసులు ఎత్తివేయాలంటూ డిమాండ్
- పాల్గొన్న జర్నలిస్టు సంఘాలు, ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు, పాత్రికేయులు



గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టు సంఘాల నాయకులు, పాత్రికేయులు

తిరుపతి సిటీ: వాస్తవాలను ప్రజలకు చేరవేసే జర్నలిస్టులపై కూటమి ప్రభుత్వం కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురిచేసే విధంగా వ్యవహరిస్తోంది. అక్రమ కేసులు పెట్టడం .. బెదిరింపులకు పాల్పడడం నిత్యకృత్యమైంది. ఈ నేపథ్యంలో 'సాక్షి' ప్రచురించిన వాస్తవాలను జీర్ణించుకోలేని కూట మి ప్రభుత్వం ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డితో పాటు మరో ఆరుగురు పాత్రికేయులపై తప్పుడు కేసులు బనాయించింది. దీనిపై జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టు సంఘాలు, ప్రెస్‌క్లబ్ సభ్యులు, పాత్రికేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ర్యాలీలు, నిరసనలు, ధర్నాలతో హోరెత్తించారు. వెంకటగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట, గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు, నిరసనలు చేపట్టారు.

జిల్లా కేంద్రం తిరుపతిలో..

తిరుపతి, చంద్రగిరికి చెందిన పాత్రికేయులు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు, ప్రెస్‌క్లబ్ కమిటీ సంయుక్తంగా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి, ఆరుగురు పాత్రికేయులపై నమోదు చేసిన కేసులు ఎత్తివేయాలని, మీడియాకు సంకెళ్లా, ప్రశ్నించే కలంపై క్రిమినల్ కేసులా...అంటూ నినదించారు. ప్రజలకు వాస్తవాలను తెలియజేయడం నేరమా, కలం కార్మికులపై కక్ష్యసాధింపు చర్యలు సిగ్గు సిగ్గు అంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్, కార్యదర్శి పీ.నరేంద్ర, ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గిరిబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మబ్బు నారాయణరెడ్డి, ప్రెస్‌క్లబ్ సెక్రటరీ పీ.బాలచంద్ర, కార్యవర్గ సభ్యులు బాలయ్య, రాష్ట్ర మీడియా ఫెడరేషన్ నాయకులు కల్లుపల్లి సురేంద్ర రెడ్డి, సాక్షి ఎడిషన్ ఇన్‌చార్జ్ ఈ.మోహన్, బ్యూరో ఇన్‌చార్జి టీ.రవిరెడ్డి, తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల పాత్రికేయులు పాల్గొన్నారు.

తక్షణం ఉపసంహరించుకోవాలి



సాక్షి ఎడిటర్, పాత్రికేయులపై పెట్టిన కేసులను ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలి. ప్రశ్నించే కలాన్ని అడ్డుకోవడం ప్రమాదకరం. రాష్ట్రంలో జర్నలిస్టులపై కేసులు, బెదిరింపు చర్యలు దురదృష్టకరం. – డాక్టర్ ఎం ప్రసాద్, జిల్లా అధ్యక్షులు, ఏపీయూడబ్ల్యూజే

బెదిరింపు చర్యలు దారుణం



పాత్రికేయులను బెదిరించి, భయభ్రాంతులకు గురిచేసే యత్నంలో భాగమే సాక్షి ఎడిటర్, జర్నలిస్టులపై కేసులు పెట్టారు. ఇలాంటి అక్రమ కేసులతో ప్రభుత్వాలకు చెడ్డపేరు తప్పదు. కలాన్ని అడ్డుకోవడం దుర్మార్గం. -కల్లుపల్లి సురేంద్రరెడ్డి, మీడియా ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు

హేయమైన చర్య



కూటమి ప్రభుత్వం పాత్రికేయులపై కేసులు నమోదు చేయడం కుట్రలో భాగమే. ప్రజాస్వామ్యంలో ఇలాంటి కక్ష్య సాధింపు చర్యలకు తావులేదు. సాక్షి ఎడిటర్, పాత్రికేయులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి. – కే.గిరిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు

అమానుషం



కూటమి ప్రభుత్వం మీడియాపై ఆంక్షలు విధించడం, కేసులు పెట్టి కళ్లెం వేయాలనుకోవడం అమానుషం. వాస్తవాలను ప్రజలకు తెలియజేయడం నేరంగా భావించి సాక్షి ఎడిటర్, పాత్రికేయులపై కేసులు బనాయించడం కక్ష్య సాధింపు చర్యలో భాగమే. – మబ్బు నారాయణరెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి, ఏపీయూడబ్ల్యూజే

కలంపై దాడి దారుణం



వాస్తవాలను ప్రచురిస్తే భయభ్రాంతులకు గురిచేసి కేసులు నమోదు చేయడం దారుణం. ఇది కలంపై దాడిగా పరిగణించాల్సిందే. ప్రజలను చైతన్యవంతులను చేసే జర్నలిస్టులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం భావ్యం కాదు. – కే.సహదేవ, సీనియర్ జర్నలిస్ట్, తిరుపతి

ఉన్నత లక్ష్య సాధనకు విద్యార్థి దశ కీలకం



ప్రతిభ చూపిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపల్, అధ్యాపకులు

తిరుపతి సిటీ: ఉన్నత లక్ష్య సాధనకు విద్యార్థి దశ కీలకమని, సెల్ ఫోన్లకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్య సాధనకు కృషి చేయాలని రిమ్స్ ప్రిన్సిపల్ డాక్టర్ జే ప్రకాష్‌రెడ్డి పిలుపు నిచ్చారు. రిమ్స్‌లో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు వారం రోజులుగా కమ్యూనికేషన్, ఎంప్లాయిబిలిటీ స్కిల్స్‌పై జరిగిన శిక్షణ శనివారం ముగిసింది. అనంతరం ఆయన మాట్లాడతూ విద్యార్థి ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే అకడమిక్ విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం పలు పోటీలలో పాల్గొని ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. డైరెక్టర్లు వై.కొండారెడ్డి, ఆనందరెడ్డి, విజయ్‌రెడ్డి, హెచ్ఓడీ మధుర, ఫౌండేషన్‌కు చెందిన గురుస్వామి, వెంకటప్రసాద్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఈఓ ఆకస్మిక తనిఖీ



అన్నదానంలో భక్తులతో మాట్లాడుతున్న ఈఓ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం ఆలయ ఈఓ బాపిరెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. క్యూలు, అన్నదానాన్ని పరిశీలించారు. భక్తుల నుంచి సూచనలు, సలహాలు తీసుకున్నారు. భక్తులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు.

ముగిసిన శ్రీకోదండరాముని తెప్పోత్సవాలు



తెప్పపై విహరిస్తున్న సీతా లక్ష్మణ సమేత శ్రీకోదండరాముడు

తిరుపతి కల్చరల్: శ్రీరామచంద్ర పుష్కరిణిలో గత మూడు రోజులుగా చేపట్టిన శ్రీకోదండరామస్వామి వారి తెప్పోత్సవాలు ఘనంగా ముగిశాయి. చివరి రోజైన శనివారం రాత్రి స్వామి వారు తెప్పపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొల్పి తోమాల సేవ, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం శ్రీసీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం చేపట్టారు. సాయంత్రం స్వామి,అమ్మవార్లు శ్రీరామచంద్ర పుష్కరిణికి వేంచేశారు. సుందరంగా అలంకరించిన తెప్పపై ఆశీనులై పుష్కరిణిలో తొమ్మిది చుట్లు విహరించి భక్తులను కనువిందు చేశారు. ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

హంస వాహనంపై లక్ష్మీనరసింహుడు



పెంచలకోనలో హంస వాహనంపై ఊరేగుతున్న స్వామి,అమ్మవార్లు

రాపూరు: వసంతోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి ఉభయనాంచారులతో కలసి శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి హంస వాహనపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. స్వామి వారి అలంకార మండపంలో నరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవీ ఉత్సవ విగ్రహాలను కొలువు దీర్చి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో అలంకరించి మేళతాళాలు మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ కోన మాడ వీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. రాత్రి పూర్ణాహుతి కార్యక్రమాన్ని చేపట్టారు. ఉదయం నందనవనంలో ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు.

క్లుప్తంగా

ఆటవిక చర్యలు ఆగవా?



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గిరిజనులను పరామర్శిస్తున్న కేవీపీ సభ్యులు

శ్రీకాళహస్తి : సమాజంలో ఇంకా నిమ్న కులాలపై అగ్ర కులాల దురహంకార దాడులు చేయడం హేయమైన చర్యగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి శ్రీకాళహస్తి డివిజన్ కార్యదర్శి రెడ్డిపల్లి సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. అగ్ర కులాల దాడిలో గాయపడి స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విరూపాక్షపురం గిరిజనులను శనివారం కేవీపీఎస్ నాయకులతో పాటు పలు ప్రజాసంఘాల నాయకులు పరామర్శించారు. దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. గద్దగుంటకు చెందిన చైతన్య విచక్షణా రహితంగా వెంకటేష్ (35), నాగయ్య(60)పై దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే బాధ్యులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, గురునాథం, సంక్రాంతి వెంకటయ్య పాల్గొన్నారు.

ఆటో బోల్తా – మహిళ మృతి



మునెమ్మ మృతదేహం

బుచ్చినాయుడుకండ్రిగ: ఆటో అదుపు తప్పి గుంతలో బోల్తా పడడంతో ఓ మహిళ మృతి చెందిన ఘటన పదోమైలు గ్రామం కేటీరోడ్డు వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. కేవీబీపురం మండలం, తిమ్మభూపాలపురం గ్రామానికి చెందిన పుల్లారెడ్డి ఆయన భార్య మునెమ్మ (55), కుమారుడు భక్తవత్సలరెడ్డి ఉల్లిపాయలు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. శనివారం వదరయ్యపాళెం గ్రామంలోని సంతకు ఆటోలో ఉల్లిపాయలు తీసుకుని వెళ్తుండగా పదోమైలు గ్రామం వద్ద ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న గుంతలో బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న మునెమ్మకు తీవ్ర గాయాలు కావడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. పుల్లారెడ్డి, భక్తవత్సలరెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. పోస్టుమార్టం నిమిత్తం మునెమ్మను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ విశ్వనాథనాయుడు తెలిపారు.

తిరుమల ఘాట్ రోడ్డులో ప్రమాదాలు

తిరుమల : తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో శనివారం సాయంత్రం రెండు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా పలువురు భక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వివరాలు.. తెలంగాణ రాష్ట్రం, మిర్యాలగూడకు చెందిన భక్తులు శ్రీవారి దర్శనార్థం తిరుమలకు చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం కారులో తిరుమల నుంచి అలిపిరికి మొదటి ఘాట్ రోడ్డు మీదుగా కిందకు దిగుతుండగా 13వ మలుపు వద్ద కారు అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ఎయిర్ బెలూన్ ఓపెన్ కావడంతో భక్తులు ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఒకరికి స్వల్పగాయాలయ్యాయి. అదేవిధంగా తమిళనాడు, చెన్నైకి చెందిన 13 మంది భక్తులు టెంపోట్రావెలర్లో శ్రీవారి దర్శనార్థం తిరుమలకు చేరుకున్నారు. శనివారం శ్రీవారిని దర్శించుకుని సాయంత్రం మొదటి ఘాట్ రోడ్డు మీదుగా కిందకు దిగుతుండగా మొదటి మలుపు వద్ద కారు అదుపు తప్పి రక్షణ గోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లోని ఆరుగురికి స్వల్పగాయాలయ్యాయి. ఘాట్రోడ్డు భద్రతా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

గోవిందా..భద్రత ఉందా?

పవిత్ర క్షేత్రంలో అపవిత్రం
- యథేచ్ఛగా నిషేధిత వస్తువులు
- పాదరక్షకులతో మహద్వారం వరకు వచ్చిన భక్తులు
- తిరుమల భద్రత గాలికి

తిరుమల: తిరుమల క్షేత్రంలో భద్రత కరువైంది. కొద్ది రోజులుగా వైకుంఠ వాసుని చెంత జరుగుతున్న వరుస సంఘటనలే దీనికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయి. వీటిపై నిఘా ఉంచాల్సిన సంబంధిత ఉన్నతాధికారులు పటిష్ట భద్రత ఉందంటూ ఊకదంపుడు ప్రసంగాలకే పరిమితమవ్వడం విమర్శలకు తావిస్తోంది.

ఇవి కనిపించలేదా గోవిందా?

- వారం క్రితం అలిపిరి టోల్గేట్ దాటుకుని ఒక ముస్లిం యువకుడు తనిఖీలు చేసుకోకుండా.. భద్రతా సిబ్బంది ఆపుతున్నా ఆగకుండా.. ముస్లిం వస్త్రాన్ని ధరించి ద్విచక్ర వాహనంపై తిరుమలకు చేరుకున్నాడు. తర్వాత తిరుమలలోని టోల్గేట్ వద్ద ఆ యువకుడిని భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. ఆ వ్యక్తిని టోల్గేట్ వద్దే అదుపు చేయలేకపోవడం అక్కడి భద్రత డొల్లతనం ఎత్తిచూపుతోంది.
- పది రోజుల క్రితం పాపవినాశనం డ్యాంలో అటవీశాఖ అధికారులు బోటింగ్ ప్రక్రియ సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. పాపవినాశనానికి బోట్లు వచ్చిన సంగతి మీడియాలో వచ్చేవరకు ఉన్నతాధికారులకు తెలియదంటే అతిశయోక్తి కాదేమో.
- మద్యం, సిగరెట్, గంజాయి వంటివి గుట్టుచప్పుడు కాకుండా తరలించేస్తున్నారు. వాటిని సేవించిన తర్వాత మందుబాబులు తిరుమలలో హల్‌చల్ చేస్తున్నారు. మాడ వీధులు మొదలుకుని అధికారులు నివాసం ఉండే ప్రాంతం వరకు కలియతిరుగుతున్నా వారిని ఎవ్వరూ ఆపలేకపోతున్నారు.
- శనివారం మహారాష్ట్రకు చెందిన అభిషేక్, ముకేష్లు తమ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవాణి టికెట్టుపై శ్రీవారి దర్శనం కోసం వైకుంఠం క్యూకాంప్లెక్స్–1 మీదుగా శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. మహద్వారం వద్ద పనిచేసే టీటీడీ భద్రతా సిబ్బంది వీరిద్దరూ డిస్పోజబుల్ పాదరక్షలను ధరించి వచ్చినట్లు గుర్తించి వాటిని తొలగింపజేశారు. డిస్పోజబుల్ పాదరక్షలతో వైకుంఠం క్యూకాంప్లెక్స్ క్యూలోకి ప్రవేశించి మహద్వారం వద్దకు వచ్చే వరకు ఎవ్వరూ గుర్తించకపోవడం అక్కడ భద్రత.. తనిఖీలు ఎలా ఉన్నాయో తేటతెల్లమవుతోంది.

శాశ్వత సీవీఎస్వో లేకపోవడమే కారణమా?

కూటమి ప్రభుత్వం వచ్చాక అధికారులను ఇబ్బడిముబ్బడిగా బదిలీ చేశారు. ఇందులో భాగంగా తిరుమలలో పనిచేస్తున్న నరసింహకిషోర్ కొన్ని నెలల క్రితం బదిలీపై వెళ్లారు. ఆ తర్వాత శాశ్వత సీవీఎస్వోను నియమించలేదు. అప్పటి నుంచి ఇన్‌చార్జ్ సీవీఎస్వోలతోనే భద్రతను నెట్టుకొస్తున్నారు. దీనికితోడు భద్రతా సిబ్బంది, విజిలెన్స్ అధికారులు సక్రమంగా తనిఖీలు చేయడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికారణంగానే తిరుమలలో వరుస ఘటనలు చోటు చేసుకుంటున్నాయని విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.



ఆలయ మహద్వారం వద్ద భక్తులు వేసుకున్న సాక్సుల్లాంటి చెప్పులు

తిరుమలలో ఘోర అపచారాలు

- పాదరక్షకులతో శ్రీవారి దర్శనానికి భక్తులు
- టీటీడీలో భద్రత డొల్లతనం బట్టబయలు
- గోవుల మృతిపై విచారణ జరిపించాలి
- టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి డిమాండ్

తిరుపతి మంగళం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తిరుమల చరిత్రలో ఎన్నడూ లేనంతగా ఘోర అపచారాలు జరుగుతున్నాయని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి మండిపడ్డారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పవిత్ర పుణ్యక్షేత్రంలో ఏదో ఒక సంఘటనలతో తిరుమల పవిత్రతను టీటీడీ అధికారులు మంటగలుపుతున్నారన్నారు. సాక్ష్యాత్తు శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనానికి ఆలయ మహద్వారం వరకు ఇద్దరు భక్తులు పాదరక్షకులతో రావడమే అందుకు నిదర్శనమన్నారు. తిరుమల మాడవీధుల్లోనే కాళ్లకు పాద రక్షకులు ధరించి తిరగడం నిషేధమన్నారు. అలాంటిది తిరుమల క్యూకాంప్లెక్స్‌లోకి ఎలా అనుమతించారు? అక్కడ నుంచి శ్రీవారి ఆలయ మహద్వారం వరకు పాదరక్షకులతో వస్తున్నా పట్టించుకోకుండా భద్రతా సిబ్బంది ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. అయితే దీనిపై టీటీడీ అధికారులు అవి పాదరక్షకులు కాదు చెవులకు రింగులు అని కూడా బుకాయిస్తారని మండిపడ్డారు. మేజోళ్లకు అనుమతి ఉందని టీటీడీ అధికారులు చెప్పినట్లు తెలిసిందన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న భూమన కరుణాకర రెడ్డి

వివరణ ఇచ్చి సరిపెట్టుకోవడం కుదరదు

తిరుమలలో వరుసగా జరుగుతున్న ఘోర అపచారాలను తాము ప్రశ్నిస్తే వాటిపై వితండ వాదనలు, వివరణలు ఇచ్చి సరిపెట్టుకోవాలంటే కుదరదని భూమన ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరుమలలో ప్రక్షాళన చేస్తానని చంద్రబాబు చెప్పినప్పటి నుంచే ఇంతటి ఘోర అపచారాలు జరుగుతున్నాయన్నారు. తిరుమల పవిత్రతను కాపాడలేని టీటీడీ పాలక మండలి వెంటనే రాజీనామా చేయాలని, తిరుమలలో భద్రతా వైఫల్యాలకు కారకులైన అధికారులు, సిబ్బందిని వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పదండి.. నిరూపిస్తా

గోమాతకు జరుగుతున్న నష్టంపైన మాట్లాడితే తనపై, జగన్‌మోహన్‌రెడ్డిపైన వ్యక్తిగత దాడికి ఆనం రామనారాయణరెడ్డితో పాటు చిన్న స్థాయి వ్యక్తులంతా మాట్లాడడం సరికాదన్నారు. గోశాలలో ఆవులు చనిపోయిన మాట నిజమని, అందుకు తాను కట్టుబడి ఉన్నానన్నారు. అక్కడికి తనతో పాటు మీడియాను తీసుకెళితే అక్కడ పూడ్చిపెట్టిన ఆవుల కళేబరాలన్నింటినీ వెలికి తీద్దామన్నారు. గోవుల మృతిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ తిరుపతి నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, తిరుతపి టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, డైరెక్టర్ మహ్మద్ ఖాసిం, ఎస్సీ విభాగం నాయకుడు కల్లూరి చంగయ్య పాల్గొన్నారు.

940 హెక్టార్లలో మొక్కల పెంపకం



నర్సరీని పరిశీలిస్తున్న జిల్లా అటవీ అధికారి

సైదాపురం: నెల్లూరు జిల్లాలో ఈ ఏడాది 940 హెక్టార్ల రిజర్వు ఫారెస్ట్ భూముల్లో మొక్కలు పెంచనున్నట్టు నెల్లూరు జిల్లా అటవీ అధికారి కదిరి మహబూబ్ బాషా తెలిపారు. సైదాపురం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన సైదాపురం సెంట్రల్ నర్సరీని శనివారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన ఈ సెంట్రల్ నరసరీలో 16 రకాలకు చెందిన 2 లక్షల మొక్కలను పెంచి.. అందులో 50 వేల మొక్కలను పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. జిల్లాలోని ఇనుకుర్తి, ఉదయగిరి, ఆత్మకూరు, కావలి, సైదాపురంలో ఉన్న నర్సరీల్లో ఈ ఏడాది 20 లక్షల మొక్కలను పెంచనున్నట్టు పేర్కొన్నారు. ఆయన వెంట రేంజర్ మాల్యాద్రి, సెక్షన్ అధికారి శ్రీనివాసులు, బీట్ రవిశేఖర్ పాల్గొన్నారు.

కాళంగి నదిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట పట్టణంలోని హోలీ క్రాస్ స్కూల్ వెనుక భాగాన ఉన్న కాళంగి నదిలో సుమారు 50 నుంచి 55 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన గుర్తుతెలియని మహిళ శవం శనివారం కనిపించింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ బ్రహ్మనాయుడు మృతదేహాన్ని బయటకు తీశారు. ఆమె వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. గంధం కలర్ చీర, ఎరుపు రంగు జాకెట్ ధరించి ఉంది. మన్నారుపోలూరు వీఆర్వో పీ.మాధవయ్య నుంచి రిపోర్టు తీసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కర్కశంగా మారిన కన్నతల్లి!

- కన్న కూతుర్ని హతమార్చి సహజ మరణంగా చిత్రీకరణ
- నరసింగాపురంలో పరువు హత్య
- ఇతర కులానికి చెందిన యువకుడిని ప్రేమించిందనే హత్య
- వివరాలను వెల్లడించిన డీఎస్పీ ప్రసాద్

చంద్రగిరి: కన్నతల్లే.. కూతురి పట్ల కర్కోటకంగా మారి కడతేర్చింది. అల్లారుముద్దుగా పెంచిన కూతురు తలవంపులు తెస్తోందని పరువు హత్యకు పాల్పడింది. ఇతర కులానికి చెందిన యువకుడిని బాలిక(16) ప్రేమించడమే ఆమె పాలిట శాపంగా మారింది. కూతురుని హత్యచేసిన తల్లి చివరకు కటకటాలపాలైన ఘటన శనివారం చంద్రగిరిలో చోటుచేసుకుంది. చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని నరసింగాపురం గ్రామానికి చెందిన దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. భర్తతో విభేదాలు రావడంతో 11 ఏళ్లుగా తల్లి అదే గ్రామంలో మరొక ఇంట్లో తన ఇద్దరు కుమార్తెలతో ఉంటోంది. బతుకుదెరువు కోసం తిరుమలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగం చేస్తోంది. ఈ క్రమంలో ఏడాదిన్నర క్రితం తన పెద్ద కుమార్తె (16), మిట్టపాళెం గ్రామానికి చెందిన అజయ్‌ని ప్రేమించింది. దీనిపై అప్పట్లో అజయ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి అజయ్‌ను రిమాండ్‌కు తరలించారు. అప్పట్లో బాలిక గర్భం దాల్చడంతో గుట్టుచప్పుడు కాకుండా నాటు వైద్యం ద్వారా గర్భస్రావం చేశారు. అయితే అప్పట్లో బాలిక ఆరోగ్యం క్షీణించడంతో తిరుపతిలోని ప్రసూతి ఆస్పత్రిలో చికిత్స అందించారు. ఇదిలా ఉండగా రిమాండ్ ఖైదీగా ఉన్న అజయ్‌ని సబ్‌జైలుకు వెళ్లి తరచూ పరామర్శిస్తున్నట్లు కుటుంబ సభ్యులకు తెలిసింది. సబ్‌జైలు నుంచి బెయిల్‌పై వచ్చిన అజయ్‌తో బాలిక తరచూ సెల్‌ఫోన్‌లో చాటింగ్‌లు చేయడం, మాట్లాడడంపై తీవ్రంగా మండిపడ్డారు.

తనను చంపేస్తారని ముందే తెలిసి

తన కుమార్తె ప్రియుడు అజయ్‌తో చాటింగ్ చేయడం, ఫోన్‌లో మాట్లాడడాన్ని తల్లి గ్రహించింది. దీంతో కుమార్తెను తీవ్ర వేధింపులకు గురిచేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో 15 రోజుల క్రితం బాలికను విషం పెట్టి చంపేసేందుకు తన తల్లి కుట్ర పన్నుతోందంటూ ప్రియుడికి వాట్సప్ ద్వారా మెసేజ్‌లు పెట్టినట్లుగా కూడా పోలీసులు గుర్తించారు. ఆపై కొద్దిరోజుల్లోనే బాలిక మృతి చెందింది.



బాలిక హత్య కేసుపై మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసాద్, సీఐ సుబ్బరామిరెడ్డి

ముక్కు, నోరు మూసివేసి!

ఇంట్లో నిద్రిస్తున్న బాలికను ఆమె తల్లే హత్య చేసినట్లుగా పోలీసులు నిర్ధారించారు. ఈ నెల 4వ తేదీన ఇంట్లో ఉన్న బాలిక ముక్కు, నోరు మూసివేసి హత్య చేసినట్లుగా నిందితురాలు ఒప్పుకున్నట్టు పోలీసులు తెలిపారు. బాలిక హత్యకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించకూడదనే ఉద్దేశంతో గంటల వ్యవధిలో దహనం చేసినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. వేరొక కులానికి చెందిన యువకుడిని ప్రేమించడంతోనే తన కుమార్తెను హత్య చేసిందని పోలీసుల విచారణలో తేలింది. ఈ మేరకు నిందితురాలిని శనివారం అదుపులోకి తీసుకున్నామని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన మీడియాకు వివరించారు. కేసు నమోదు చేసిన 72 గంటల వ్యవధిలో కేసును ఛేదించిన సిబ్బందికి డీఎస్పీ రివార్డులను అందజేశారు. సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐ అనిత ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల హవా



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో శ్రీచైతన్య విద్యాసంస్థ ఏజీఎం, డీన్‌లు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో ఈ.గణేష్‌రెడ్డి, జె.సార్విక, ఎస్.ప్రణవి, ఎస్.హారిక 990 మార్కులు, జి.ప్రశాంత్‌రెడ్డి, కె.దివ్యశ్రీ, పి.స్పందన, ఎస్.నవీన్ 989 మార్కులు సాధించగా.. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో సి.తన్మయి 466, ఎం.దివ్యశరణ్య, జి.జాహ్నవి, కె.హంసలేఖ, ఎ.రుషివేంద్ర, సి.యశ్వంత్‌కుమార్, బి.దివ్యశ్రీ, ఎ.నాగరిషిక 465 మార్కులు సాధించారు. అలాగే జూనియర్ బైపీసీ విభాగంలో కె.అభిగ్నరెడ్డి, టి.హర్షిత, వై.జోషిత 434 మార్కులు సాధించగా.. వీరిని విద్యాసంస్థల ఏజీఎం బీవీ ప్రసాద్, డీన్‌లు కెఎల్‌జీ.ప్రసాద్, రామమోహన్‌రావు, శ్రీనివాసరాజు, భాస్కర్ అభినందించారు.

తిరువణ్ణామలై రద్దీ

తిరుపతి అర్బన్: పౌర్ణమి సందర్భంగా తిరుపతి జిల్లా నుంచి పెద్ద ఎత్తున భక్తులు తమిళనాడులోని తిరువణ్ణామలైకి వెళ్లారు. జిల్లాలోని 10 డిపోల నుంచి 81 సర్వీసులను ఏర్పాటు చేశారు. అందులో తిరుపతి డిపో నుంచి 17 సర్వీసులను ఏర్పాటు చేశారు. అయితే ఒక్క తిరుపతి నగరం నుంచే 10వేల మంది భక్తులు శనివారం తిరువణ్ణామలైకి వెళ్లినట్లు అధికారులు లెక్కలు వేస్తున్నారు. రద్దీ నేపథ్యంలో తొక్కిసలాటలు లేకుండా జిల్లా ప్రజారవాణా అధికారి నరసింహులు, ఏటీఎం రామచంద్రనాయుడు, డీఎం బాలాజీ, టీఐ వీఆర్ కుమార్ చర్యలు చేపట్టారు.

వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడనే కూల్చేశారు

గూడూరు రూరల్: వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడిగా ఉన్నారన్న నెపంతో మరొకరి దగ్గర కొనుగోలు చేసుకుని అందులో నిర్మాణం చేపట్టిన దుకాణాలను కబ్జాగట్టి కూల్చివేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గూడూరు పట్టణంలోని జెడ్పీ హైస్కూల్ రోడ్డులో సర్వే నం.576–సి, 576–ఏలో ప్రైవేట్ వ్యక్తుల దగ్గర స్థలం కొనుగోలు చేసుకుని దుకాణాలు నిర్మించుకుని మూడేళ్లుగా మున్సిపల్ పన్నులు కూడా చెల్లిస్తున్నామని బాధితుడు శ్రీనివాస్ తెలిపాడు. అలాంటి హక్కులు కలిగిన స్థలంలో గూడూరు తహసీల్దార్ చంద్రశేఖర్ కబ్జాగట్టి దుకాణాలను జేసీబీల ద్వారా కూలదోశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణలో ఉన్నప్పటికీ కట్టడాలు ఉంటే ముందస్తుగా కనీస సమాచారం, నోటీసులైనా ఇచ్చి ఖాళీ చేయించాలే తప్ప ఇలా ఒకేసారి కూలదోయడం ఎంతవరకు సబబు అన్నారు. అలాగే మరో బాధితుడు వెంకయ్య మాట్లాడుతూ నోటీసు ఇవ్వకుండా కూల్చేసి మరుసటి రోజున ఫోర్జరీ సంతకాలతో నోటీసును గోడకు అంటించారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులుగా ఉండడంతోనే ఇలా అధికారులు, కూటమి నాయకులు కబ్జాగట్టి ఆస్తులు ధ్వంసం చేస్తున్నారని వాపోయారు.

ఆక్రమణలపై దృష్టి పెట్టండి

పట్టణంలో రోజురోజుకీ పెరిగిపోతున్న ఆక్రమణలపై దృష్టి పెట్టాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. జెడ్పీ హైస్కూల్ రోడ్డులో కొనుగోలు చేసిన భూమిలో ఆ క్రమణల పేరుతో దుకాణాలు తొలగించారని, ఇలాంటి ఆక్రమణలు గూడూరు పట్టణంలో కోకొల్లలుగా ఉన్నాయని, వాటిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు పంటా శ్రీనివాసులురెడ్డి, వేమయ్య, బ్రహ్మయ్య, సుబ్బరాజు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో శ్రీధర్స్ ప్రభంజనం

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి శ్రీధర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించారని కళాశాల చైర్మన్ మద్దినేని శ్రీధర్ తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో సి.ఉమామహేశ్వర్ 465, కె.నిత్యశ్రీకల్యాణి 464, వి.శ్రీకర్‌రెడ్డి 463, ఎస్.యామిని, కె.పనుష్య, పి.వాసవి, పి.మానస 462, సి.షామితారెడ్డి, పి.యశ్విత 460 మార్కులు సాధించారన్నారు. జూనియర్ బైపీసీ విభాగంలో సి.జ్యోష్ణ 433, వీఎస్ రక్షిత 426, ఎం.దివ్య 422, సి.ధన్యత, వి.ప్రియదర్శిని 419 మార్కులు సాధించినట్లు చెప్పారు. అలాగే సీనియర్ ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో బి.వన్షిక, మహమ్మద్ ఇమ్రాన్ 987, పి.నిఖిలేశ్వర్ 985, ఆర్.యుక్త 984, మహమ్మద్ తాలిబ్, డి.షోషిత 980 మార్కులు సాధించినట్టు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులతో శ్రీధర్స్ జూనియర్ కళాశాల చైర్మన్ మద్దినేని శ్రీధర్

రైలు ఢీకొని వ్యక్తి మృతి

గూడూరు రూరల్: పట్టాలు దాటుతున్న ఓ వ్యక్తిని రైలు ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతిచెందిన ఘటన గూడూరు రైల్వేస్టేషన్‌లో శనివారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం.. గూడూరు రైల్వే స్టేషన్ చివరి భాగంలో రైలు పట్టాలు దాటుతున్న సుమారు 55 సంవత్సరాల గుర్తుతెలియని వ్యక్తిని బెంగళూరు నుంచి గౌహతి వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి